వైసీపీ జిల్లా కార్యాలయం శంకుస్థాపనకు మాజీ ఎమ్మెల్యే కదిరి

విశాలాంధ్ర-సీఎస్‌పురం : జిల్లా కేంద్రమైన ఒంగోలులో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయం నిర్మాణానికి జిల్లా పరిషత్ కార్యాలయం సమీపంలో బైపాస్ రోడ్డు ఎదురుగా ఆదివారం శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో కనిగిరి మాజీ ఎమ్మెల్యే కావలి నియోజకవర్గం పరిశీలకులు కదిరి బాబురావు పాల్గొన్నారు. ఆయనతోపాటు జిల్లా మంత్రి ఆదిమూలపు సురేష్, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులురెడ్డి, జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ బీద మస్తాన్‌రావు, జిల్లా పార్టీ అధ్యక్షులు జంకె వెంకటరెడ్డి, జెడ్పి చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వైసీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర ప్రకాశం జిల్లా

చింతపల్లిపాడులో పర్యటించిన ఎమ్మెల్యే ఏలూరి

విశాలాంధ్ర-యద్దనపూడి : బాపట్ల పార్లమెంటరీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు మండలంలోని చింతపల్లి పాడులో పర్యటించారు. గ్రామంలోని టిడిపి నాయకులతో పార్టీ బలోపేతం గురించి చర్చించారు. గ్రామ సమస్యలపై నాయకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామానికి చెందిన జంపనీ రాకేష్ కుమారుని పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాయపాటి సీతయ్య, జంపని అంకమ్మ, పొత్తూరి అశోక్ రంగారావు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కోటేశ్వరమ్మ మృతికి సంతాపం

విశాలాంధ్ర-ఒంగోలు : సీపీఐ పార్టీ సభ్యురాలు దిడ్ల కోటేశ్వరమ్మ(55) ఆదివారం మృతి చెందారు. ఆమె మృతికి సీపీఐ ఒంగోలు నగర సమితి సంతాపం తెలియజేసింది. సీపీఐ ఒంగోలు నాయకులు ఉప్పుటూరి ప్రకాశరావు, ఎస్‌డి సర్దార్, కైలా అజయ్, చినిగే సుబ్బారావు కోటేశ్వ రమ్మ మృతదేహం సీపీఐ జెండాని కప్పి నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ కోటేశ్వరమ్మ కుటుంబం తాతలు, తండ్రుల నాటి నుండి సీపీఐ పార్టీ సభ్యులుగా ఉన్నా రన్నారు. పార్టీకి ఎనలేని సేవలు చేశారన్నారు. కోటేశ్వరమ్మ మృతి పేర్నమిట్ట సీపీఐ పార్టీకి తీరని లోటన్నారు.

భైరవకోనను సందర్శించిన కర్నూలు జడ్పీ చైర్మన్

విశాలాంధ్ర-సీఎస్‌పురం : జిల్లాలోని ప్రసిద్ధి పుణ్య క్షేత్రమైన పర్యాటక కేంద్రమైన భైరవకోనను కర్నూలు జిల్లా జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి సందర్శించి పూజలు చేశారు. ఆదివారం ఆయన భైరవకోనలోని వాటర్‌ఫాల్స్‌ను, ప్రముఖ దుర్గాంబ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు భైరవకోనలోని ఆలయ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి వారి మిత్రమండలికి భైరవకోన అర్చకులు వేదమంత్రాలతో స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పీరం సత్యనారాయణరెడ్డి, పీరం బైయపురెడ్డి, పీరం నాగేశ్వరరెడ్డి, కోనేటి కొండారెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా కానిస్టేబుల్ పరీక్ష

విశాలాంధ్ర-మార్కాపురం : కానిస్టేబుల్ ప్రాథమిక వ్రాత పరీక్షలు మార్కాపురం పట్టణంలోని 21 పరీక్ష కేంద్రాలలో ఆదివారం ప్రశాంతమైన వాతావరణంలో జరిగాయి. ఉదయం 10 గంటలకు నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలలో మొత్తం 7,481మంది అభ్యర్థులు పాల్గొన్నారు. ఈ పరీక్షల నిర్వహణ సందర్భంగా అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు తగు ఏర్పాట్లు చేశారు. అలాగే పరీక్షల నిర్వహణకు సంబంధించి డీఎస్పీ స్థాయి అధికారితో 4 క్లస్టర్లుగా ఏర్పడి నలుగురు సిఐలు, 14 మంది ఎస్సైల తో కలిసి 279 మంది పోలీసులతో బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగింది. డీఎస్పీ డాక్టర్ యమ్.కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో సీఐ యమ్.భీమా నాయక్ పరీక్షా కేంద్రాలను సందర్శించి తనిఖీ చేశారు. ఈ సీఐ నాయక్ వెంట ఎస్ ఐ లు ఏ.శశి కుమార్, ఆర్.సుమన్ వున్నారు.

ఎస్సై ప్రేమ్ కుమార్‌ను కలిసిన మాజీ ఎంపీపీ

విశాలాంధ్ర-తాళ్లూరు : మండల నూతన ఎస్సైగా ఇటీవల విధుల్లో చేరిన బి ప్రేమ కుమార్‌ను మాజీ ఎంపీపీ గొల్లపాటి మోషే తదితరులు ఆదివారం పోలీస్ స్టేషన్లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఎస్సై ప్రేమ్ కుమార్‌ను అభినందిస్తూ శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి జక్కుల రామకృష్ణ తదితరులు ఉన్నారు.

మైనార్టీ నాయకుల అభినందనలు

విశాలాంధ్ర-తాళ్లూరు : మండల నూతన ఎస్సైగా వీధుల్లో చేరిన బి.ప్రేమ కుమార్‌ను ఆదివారం ప్రకాశం జిల్లా వైసీపీ మైనార్టీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ లతీఫ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఎస్సై ప్రేమ కుమార్‌కు శాలువా కప్పి ఘనంగా సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ యువ నాయకులు ఎస్ సైదా తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ భూమిని పంపిణీ చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న వ్య.కా.స జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రావు, పక్కన సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ తదితరులు

విశాలాంధ్ర-కనిగిరి : భూమిలేని అర్హులైన పేదలకు ప్రభుత్వ భూములను గుర్తించి వాటిని పంపిణీ చేయాలని బీకేయంయు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కనిగిరి దర్శి చెంచయ్య భవన్లో ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం బికేయంయు జిల్లా అధ్యక్షుడు సయ్యద్ మౌలాలి ఆధ్వర్యంలో జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ జగనన్న కాలనీలో మౌలిక వసతులు, ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జగనన్న కాలనీకి పల్లెల్లో మూడు సెంట్లు పట్టణాల్లో రెండున్నర సెంట్లు స్థలం కేటాయించి ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు నిధులు లబ్ధిదారులకు మంజూరు చేయాల న్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలు ఏమాత్రం సరిపోవు అన్నారు. ఫిబ్రవరి 6న జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఫిబ్రవరి 22వ తేదీన రాష్ట్ర రాజధాని విజయవాడలో మహా ధర్నా కార్యక్రమంలో లబ్ధిదారులు పాల్గొని ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. ఈ సందర్భంగా బికేఎంయు జిల్లా కార్యదర్శి ఆర్ వెంకట్రావు మాట్లాడుతూ కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని కోరారు. గ్రామీణ ప్రాంతా ల్లో వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పనులు లేక వలస పోతున్నారని కేంద్ర రాష్ట్ర చేతకానితనం వల్లే కూలీలకు పనులు దొరకటం లేదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపి కూలీలు వలస పోకుండా చర్యలు చేపట్టాలన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వై.రవీంద్రబాబు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం దివాలా తీసింది అన్నారు. ఉపాధి హామీ కూలీలకు రోజువారి వేతనం 600 చొప్పున ఇవ్వాలని, సంవత్సరానికి 200 రోజులు పని దినాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవ సాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జిపి రామారావు, గద్దల రవి, ఎస్కేవై పెద్ద మస్తాన్, జూపూడి కోటేశ్వరరావు, డిహెచ్పిఎస్ జిల్లా కార్యదర్శి మోహన్, వెంకట్ కొండయ్య, కోటేశ్వరరావు, విజయ, పోతుల ప్రభాకర్, జి తిరుపాలు, జి.రమణమ్మ, బండి తిరుపాలు పాల్గొన్నారు.

వైసీపీ కార్యాలయానికి భూమి పూజ

విశాలాంధ్ర-ఒంగోలు : ఒంగోలు పట్టణంలో వైఎస్ఆర్సిపి కార్యకర్తలు, నాయకులు, అభిమానులు కోరు కుంటున్న వైయస్సార్సీపి పార్టీ కార్యాలయం శంకుస్థాపన కార్యక్రమం ఆదివారం మినీ స్టేడియం ప్రక్కన అంగరంగ వైభవంగా జరిగింది. ముఖ్య అతిథులుగా జిల్లా పార్టీ అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి,మాజీ మంత్రివర్యులు మరియు ఒంగోలు శాసనసభ్యులైన బాలినేని శ్రీనివాస రెడ్డి,రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు,రాష్ట్ర మంత్రివర్యులు ఆదిమూలపు సురేష్, జడ్పీ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, చీరాల శాసనసభ్యులు కరణం బలరాం, గిద్దలూరు శాసనసభ్యులు అన్నా రాంబాబు, దర్శి శాసన సభ్యులు మద్దిశెట్టి వేణుగోపాల్, మార్కాపురం శాసనసభ్యులు కందులు నాగార్జున రెడ్డి, ఎమ్మెల్సీ పోతుల సునీత, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, మాజీ శాసనసభ్యులు శిద్దా రాఘవరావు, కొండేపి ఇంచార్జి వరికుటి అశోక్ బాబు, వైఎస్ఆర్సిపి పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఫాగింగ్

విశాలాంధ్ర-సీఎస్‌పురం : సీఎస్‌పురంలో దోమలు ఉధృతంగా విజృంభిస్తుండటంతో పంచాయితీ కార్యదర్శి రాం ప్రసాద్ ప్రత్యేక చొరవ తీసుకొని ప్రభుత్వం నుంచి సీఎస్‌పురం పంచాయితీకి ఫాగింగ్ మిషన్ యంత్రాన్ని మంజూరు చేయడం జరిగింది. పంచాయితీ విస్తీర్ణం పెద్దది కావడంతో ప్రతిరోజు ఆటోలో ఫాగింగ్ మిషన్‌తో దోమల నిర్మూలనకు విస్తృతంగా ఫాగింగ్ చేస్తున్నారు. ఆదివారం సెలవుదినం అయినప్పటికీ సీఎస్‌పురంలో పలు వీధుల్లో ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాలు ఉన్న తహశీల్దారు కార్యాలయం, ఎండీఓ కార్యాలయం, ప్రభుత్వ వైద్యశాలల వద్ద ముమ్మరంగా ఫాగింగ్ చేయించారు. పంచాయితీ కార్యదర్శి రాం ప్రసాద్ పాల్గొన్నారు.

వెనుకబడిన వర్గాల సంక్షేమానికి వైసీపీ ప్రభుత్వం తూట్లు

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముత్తుముల

విశాలాంధ్ర-గిద్దలూరు : గిద్దలూరు నగర పంచాయతీలోని 17, 18 వార్డులలో తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు స్థానిక టీడీపీ నాయకులు షేక్ మహబూబ్ బాషా, షేక్ పెద్ద మస్తాన్, చింతలపూరి బాల రాజు, బొంతా లక్ష్మీదేవి, దూదేకుల హజరత్, పిడతల రవితేజ, మాజీ కౌన్సిలర్ చింతలపూరి రామలక్ష్మి, నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి గిద్దలూరు టీడీపీ ఇంచార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అశోక్‌రెడ్డికి క్రేన్ ద్వారా భారీ గజమాల వేసి, మహిళలు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. వార్డులో ఏర్పాటు చేసిన రచ్చబండలో వారు మాట్లాడుతూ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి, ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చకపోగా టీడీపీ హయాంలో అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాలను తన అక్కసును వెల కక్కాడన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు దూదేకుల దస్తగిరి, బొర్రా రాఘవేంద్ర యాదవ్, దూదేకుల ఖాజా, చిటికెన లలిత, పాలకొలను మహేశ్వర రెడ్డి, నాయబ్ ఖాజా, గిద్దలూరు పట్టణ అధ్యక్షులు సయ్యద్ శానేషా వలి, 3వ వార్డు కౌన్సిలర్ పాలుగుళ్ల చిన్న శ్రీనివాస రెడ్డి, 2వ వార్డు కౌన్సిలర్ బూనబోయిన చంద్రశేఖర్ యాదవ్, 7వ వార్డు కౌన్సిలర్, బిల్లా రమేష్ యాదవ్, పార్లమెంట్ ఉపాధ్యక్షులు గోపారపు గోపాల్ రెడ్డి, మండల అధ్యక్షులు మార్తాలా సుబ్బారెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు రాయప్రోలు సుబ్బరాయ శర్మ, గుంటిక చిన్న కొండయ్య యాదవ్, పట్టణ ప్రధాన కార్యదర్శి పందీటి రజిని బాబు, షేక్ అహమ్మద్ బాషా పాల్గొన్నారు.

షటిల్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎస్సై

విశాలాంధ్ర-వెలిగండ్ల : మండల కేంద్రమైన వెలిగండ్లలో ఎస్సై పి మహేష్ కుమార్ షటిల్ టోర్నమెంట్‌ని శనివారం ప్రారంభించినట్లు కనిగిరి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు కసునూరి మౌలాలి ఆదివారం తెలిపారు. ఈ టోర్నమెంట్‌కి మొదటి బహుమతి బొబ్బ భూపాల్‌రెడ్డి 3000, రెండో బహుమతి వెంకటయ్య 2000 మూడో బహుమతి స్వామి (ఆర్.ఎం.పి) 1000, రూపాయలతో విజేతలకు సీల్డ్ కవర్లు కసునూరి మౌలాలి ఇవ్వనున్నట్లు తెలిపారు.

దేవాలయాలను సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తి

విశాలాంధ్ర-త్రిపురాంతకం : త్రిపరాంతకంలో వెలసిన ఉబయ దేవాలయాలను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి మల్లికార్జునరావు దంపతులు సందర్శించారు. ముందుగా శివాలయంలో మంగళ వాయిద్యాలతో ఆలయ నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. ఆలయ పూజారులు విశ్వం, ప్రసాద్ శర్మలు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు పలికారు. ఆయన వెంట ఆలయ నిర్వహణ అధికారి ఈదుల చెన్నకేశవరెడ్డి,ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు ఆయన వెంట వున్నారు.

మాతృ హృదయాన్ని చాటిన మహిళా హెడ్ కానిస్టేబుల్

విశాలాంధ్ర-సంతనూతలపాడు : మండలంలోని ఎండ్లూరు డొంకా వద్ద గల ఎస్ఎస్ ఇంజనీరింగ్ కళాశాల నందు ఆదివారం జరుగుతున్న కానిస్టేబుల్ ప్రాథమిక రాత పరీక్ష రాయటానికి కాలేజీకి వచ్చిన మహిళా అభ్యర్థినికి ఆరునెలల బేబీ ఉంది. ఆ బేబీని ఆమె వారి భర్త వద్ద వదిలి పరీక్ష రాయటానికి లోపలి వెళ్లిన కొద్దిసేపటికి ఆ బేబీ ఏడుపు కేకలు అధికం కాగా, సదరు వ్యక్తి ఏమీ చేయలేని పరిస్థితిలో డయల్ 112కు కాల్ చేసి సమాచారం అందించారు. ఆ సమాచారం అందుకున్న కంట్రోల్ రూమ్ పోలీస్ అధికారులు ప్రకాశంజిల్లా ఎస్పీ మలిక గర్గ్ ఆదేశాల మేరకు ఆ పరీక్షా కేంద్రం వద్ద విధులు నిర్వహిస్తున్న అధికారులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన సంతనూతలపాడు ఎస్సై బి.శ్రీకాంత్, మహిళా హెడ్ కానిస్టేబుల్ పరమేశ్వరి బేబీని దగ్గర తీసుకుని పాలు అందించి ఏడవకుండా మాతృ హృదయాన్ని చాటుకుంది.

నేడు 'గడపగడపకు మన ప్రభుత్వం'

విశాలాంధ్ర-పీసీపల్లి : మండలంలోని గుదేవారి పాలెం పంచాయతీ పరిధిలో నేడు ఉదయం 9 గంటల నుండి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో రమణారెడ్డి ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బుర్ర మధుసూదన్ యాదవ్ పాల్గొని గడపగడపకు వెళ్లి సంక్షేమ పథకాలు అమలు తీరుపై ప్రజలకు వివరిస్తారని తెలియజేశారు. కావున సచివాలయ సిబ్బంది అధికారులు వాలంటీర్లు గ్రామస్తులు హాజరవ్వాలని తెలియజేశారు.

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని పసుపుగల్లు గ్రామంలో నేడు సోమవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎమ్మెల్యే కార్యాలయం మేనేజర్ ఎంవి భాస్కర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ప్రారంభం అవుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దర్శి ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ హాజరవుతారని ఆయన తెలిపారు.

కరెంట్ బిల్లులు సచివాలయంలో చెల్లించాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : కరెంటు బిల్లులను ఇకపై గ్రామ సచివాలయంలో చెల్లించి రసీదులు పొందాలని విద్యుత్ ఏఇ జే భూరాజు తెలిపారు. ఆదివారం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో సిబ్బందికి పలు సూచనలు సలహాలు చేశారు. ప్రతి గ్రామంలో సచివాలయం వద్ద హౌసింగ్ బిల్లులు వ్యవసాయ బిల్లులు చెల్లించేలా ప్రజలను చైతన్యవంతులు చేయాలన్నారు. సిబ్బంది గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి నెల నెల క్రమం తప్పకుండా విద్యుత్ బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తిన సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో లైన్ మాన్‌లు ఎస్కే మాసూమ్ మస్తాన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్తుకు టీడీపీ అధికారంలోకి రావాలి

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : తెలుగుదేశం జాతీయ పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు, కనిగిరి నియోజక వర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాజీ శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు మండల పరిధిలోని దాసరిపల్లి గ్రామం నందు ఆదివారం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో గ్రామపార్టీ అధ్యక్షులు కాటేపల్లి చిన్న ఆవులయ్య అధ్యక్షతన ఇదేం ఖర్మ అనే ప్రోగ్రాంని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా సానికొమ్ము తిరుపతిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి అరాచక పాలన అంతం కావాలంటే ప్రజల్లో చైతన్యం తిరుగుబాటు రావాలని ఆయన అన్నారు. అలానే రాష్ట్రానికి పట్టిన కర్మను వదిలించుకునేందుకు ప్రజల సిద్ధంగా ఉండాలని ఆయన కోరారు. అలానే వైసీపీ చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను పెంచిన ధరలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గాయం రామిరెడ్డి, కందుల వెంకట సుబ్బారెడ్డి, చీకటి వెంకటసుబ్బయ్య, దోసపాటి వెంకట నరసయ్య, కేశమ్మ, బాల నరసయ్య, రావుల చెన్నయ్య, బాల చెన్నయ్య, చిన్న నరసయ్య, అంకయ్య, బాల, దోసపాటి రమణయ్య తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రముఖులతో వెలిగండ్ల నాయకులు

విశాలాంధ్ర-వెలిగండ్ల : వైఎస్ఆర్సిపి రాజ్యసభ సభ్యులు మూడు జిల్లాల వైసిపి కోఆర్డినేటర్ బీదర మస్త్రానావు, మాజీ మంత్రివర్యులు బాలినేని శ్రీనివాస్‌రెడ్డిని వెలిగండ్ల మండలం వైఎస్ఆర్సిపి నాయకులు సర్పంచ్ తాతపూడి సురేష్ బాబు మాజీ సింగిల్ విండో అధ్యక్షులు, సచివాలయ మండల కన్వీనర్ పి సుబ్రమణ్యం ఆదివారం ఒంగోలులో వైయస్సార్ క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలసి పుష్ప గుచ్ఛమిచ్చి అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న అనేక పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని వారు సూచించినట్లు తెలిపారు.

వైసీపీ కార్యాలయ శంకుస్థాపనకు తరలిన ప్రముఖులు

భూమి పూజ చేస్తున్న బాలినేని, జంకే తదితరులు

విశాలాంధ్ర-గిద్దలూరు : ఒంగోలు టౌన్ నందు ఒంగోలు మినీ స్టేడియం వెనుక వైపు మరియు ఇరిగేషన్ ఆఫీస్ ఎదురుగా ఉన్న స్థలంలో జిల్లా వైసీపీ కార్యాలయం భూమి పూజ మహోత్సవంలో మూడు జిల్లాల కో-ఆర్డినేటర్ మరియు ఒంగోలు శాసనసభ్యులు బాలినేని శ్రీనివాసరెడ్డి, ప్రకాశం జిల్లా ఇంచార్జి మంత్రి మెరుగ నాగార్జున, జిల్లా మంత్రి ఆదిమూలపు సురేష్, ప్రకాశం జిల్లా వైసీపీ అధ్యక్షులు జంకే వెంకటరెడ్డి మరియు రీజియనల్ కో-ఆర్డినేటర్ బీద మస్తాన్‌రావు, ప్రకాశం జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకయమ్మ, సహచర ప్రజా ప్రతినిధులతో కలసి గిద్దలూరు శాసన సభ్యులు అన్నా వెంకట రాంబాబు పాల్గొన్నారు.

ఒంగోలుకు తరలిన ఎమ్మార్పీ, ఎంఎస్‌పీ నాయకులు

విశాలాంధ్ర-సీఎస్‌పురం : ఒంగోలులో జరగబోయే మహాజన సోషలిస్ట్ పార్టీ కార్యవర్గ సమావేశానికి మహాజన సోషలిస్ట్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎంఆర్పిఎస్ మండల నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో ఆదివారం బయలు దేరారు. జెపి రాజ్ మాదిగ మాట్లాడుతూ మహాజన సోషల్ పార్టీ మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో పార్టీని బలోపేతం చేయటానికి మా వంతుగా కృషి చేస్తామని ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి దాదాపు 30 సంవత్సరాలు నడుస్తున్న ఎస్సీ వర్గీకరణ అంశంతో పాటు ఆరోగ్యశ్రీ కార్డు రెండు తెలుగు రాష్ట్రాల్లో అమలు కావడానికి ఎమ్మార్పీఎస్ ఉద్యమం చేపట్టబడితే ఆరోగ్యశ్రీ కార్డు అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ అమలు చేసింది. అదేవిధంగా వితంతువుల పింఛన్‌లు వికలాంగుల పింఛన్లు పెంపొందించడానికి కూడా ఎమ్మార్పీఎస్ ఉద్యమం ద్వారా జరిగిందని అన్నారు. ఎం.ఎస్.పి పార్టీ అంటే బడుగు బలహీన వర్గాలకు మాత్రమే కాదు అందరు కూడా అగ్రకుల నిరుపేదలకు అన్ని వర్గాలకు సమానత్వంగా మహనీయుల ఆలోచన విధానాల్లో మహాజన సోషలిస్ట్ పార్టీ నడుస్తాదని అన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ నాయకులు సంగటి ఐజాక్ మాదిగ, ఆమోస్ మాదిగ, అంగల్‌కుర్తీ సురేష్ మాదిగ, సలగాల నవీన్ మాదిగ, నవీన్ మాదిగ హాజరయ్యారు.

రావిపూడి వెంకటాద్రికి ఘన నివాళి

విశాలాంధ్ర-చీరాల : నిండు నూరేళ్లు జీవించి తన జీవితాన్ని హేతువాద ఉద్యమానికి అర్పించిన రావిపూడి వెంకటాద్రికి జన విజ్ఞాన వేదిక తరపున ఘనమైన నివాళు లర్పిస్తున్నామని జెవివి వెంకటేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం రాడికల్ హ్యూమనిస్ట్ సెంటర్లో వెంకటాద్రి పార్థివదేహానికి జన విజ్ఞాన వేదిక తరపున పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరెడ్డి మాట్లా డుతూ నేడు సమాజంలో పెరుగుతున్న మతతత్వం, కులతత్వం, మూఢనమ్మకాల ధోరణిలో రావిపూడి వెంక టాద్రి మరణం నేటి సమాజానికి తీరనిలోటని, ఆయన జీవితంలో దాదాపు వంద పుస్తకాలు రచించి, ఎనిమిది దశాబ్దాల పాటు తన ఉద్యమ జీవితంలో వందలాది హేతువాద కార్యకర్తలను తయారు చేశారని అన్నారు. భారతదేశ వ్యాప్తంగా కేరళ, తమిళనాడు,ఉత్తర భారతదేశం, రెండు తెలుగురాష్ట్రాలు,ప్రపంచ దేశాల్లో రాయపూడి హేతువాదం,మానవతావాదం, శాస్త్రీయ భావజాలంతో ప్రభావితులైన వారు వేలాదిగా ఉన్నారని అన్నారు. ఒక వ్యక్తి తన జీవితంలో ఇన్ని రకాలుగా శిఖరాగ్రస్థాయికి చేరడం చాలా అరుదైన విషయమని అందుకే జనవిజ్ఞాన వేదిక, కెవిఆర్ విజ్ఞాన కేంద్రం తరఫున ఘనమైన నివాళు లర్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుర్ర హనుమంతరావు, సత్యనారాయణ, జయంత్ వాసు, తదితరులు పాల్గొన్నారు.

నారాయణస్వామి దేవస్థానంలో పూజలు

విశాలాంధ్ర-సీఎస్‌పురం : జిల్లాలోని ప్రసిద్ధి పుణ్య క్షేత్రమైన శ్రీ మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం నారాయణస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. నారాయణస్వామికి విశిష్టవారమైన ఆదివారం కావడంతో నారాయణస్వామి దేవస్థానంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. నారాయణస్వామి దేవస్థానంలో గోపూజ, అనంతరం నారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. నారాయణస్వామి దేవస్థానానికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నారాయణస్వామి దేవస్థానం ఈఓ నర్రా నారాయణరెడ్డి, దేవస్థాన కమిటీ సభ్యులు మంచికంటి మధుసూదన్, జిలకర అంజిరెడ్డి, నల్లమడుగుల ఉప సర్పంచి ముడిమాల నారాయణరెడ్డి, కోవిలంపాడులోని ఆర్యవైశ్య సత్రం అధ్యక్షులు సుబ్బారావు, గుబ్బా పూర్ణ, ఎలిక నాగేశ్వరరావు, దేవస్థాన అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వ హయాంలోనే గడప గడపలో సంక్షేమం

ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

విశాలాంధ్ర-కనిగిరి : వైసీపీ ప్రభుత్వం హయాంలోనే ప్రతి ఇంటి గడపగడపలో సంక్షేమ ఆనందం వెల్లివిరుస్తుందని ఎమ్మెల్యే, టిటిడి పాలకవర్గ సభ్యులు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. ఆదివారం కనిగిరి మున్సిపాలిటీలోని ఏడవ వార్డులో కూచిపూడి పల్లెలో గడపగడప మన ప్రభుత్వ కార్యక్రమం కౌన్సిలర్ తమ్మినేని సుజాత శ్రీరామ్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఎమ్మెల్యే బుర్రా మధు సూదన్ యాదవ్ వైసీపీ ప్రభుత్వంలో జరిగిన సంక్షేమ కార్యక్రమాల వివరాలను మహిళలకు వివరిస్తూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యేగా తనకు మరోసారి మద్దతు తెలపాలని కోరారు. ఈ సందర్భంగా మహిళలు, వైసిపి నాయకులు, స్థానికులు ఆనందంగా ఎమ్మెల్యే బుర్రాకు హారతి ఇచ్చి, పూలమాలతో సన్మానించి స్వాగతం పలికారు. ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి తాము ఎప్పుడూ అండగా ఉంటామని మహిళలు స్థానికులు దీవించారు. ఈ సందర్భంగా ఏడో వార్డులో అంతర్గత రోడ్డు అస్తవ్యస్తంగా ఉందని రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని మహిళలు ఎమ్మెల్యే బుర్రా దృష్టికి తీసుకొని రాగా తక్షణమే మున్సిపల్ అధికారులతో మాట్లాడి 1 నెలలోపు రోడ్డు వేయాలని అధికారులను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లో గడపగడప మన ప్రభుత్వ కార్యక్రమంలో స్థానికులు చెప్పిన సమస్యలను గుర్తించి సత్వరమే పరిష్కరించేలా చొరవ చూపాలని అధికారులను ఆదేశించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ముఖ్యమంత్రి జగన్మో హన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని, ఈ సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇవ్వడం వైసిపి ప్రభుత్వానికే చెల్లిందన్నారు. ఈ కార్య క్రమంలో చైర్మన్ అబ్దుల్ గఫార్, సానికొమ్ము రంగనాయకులరెడ్డి, జెడ్పిటిసి కస్తూరిరెడ్డి, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, డాక్టర్ మురళి, వైస్ చైర్మన్‌లు పులి శాంతి, గోవర్ధన్‌రెడ్డి, మాణిక్యరావ్, పిల్లి లక్ష్మీ నారాయణరెడ్డి, కౌన్సిలర్ రామనబోయిన శ్రీని వాసులు, వేల్పుల వెంకటేశ్వర్లు, జంగమయ్య, చవిడిశెట్టి శీను, నాగూర్ బీ,భారతి, దశరథ, తమ్మినేని రాజేశ్వరి, రమణమ్మ, సుబ్బారావమ్మ, శ్రీరాములురెడ్డి, గోపి, అచ్చాల శ్రీనివాసులు, సుబ్బారెడ్డి, మార్తల రాంబాబు, మస్తానమ్మ, బీసీ సెల్ కన్వీనర్ కంటు గురవయ్య, కోఆప్షన్ సభ్యులు అబ్రహం లింకన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం

విశాలాంధ్ర-పర్చూరు: ఉపాధ్యాయులు నూతన విద్యా విధానానికి అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించు కోవాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ విఠపు బాల సుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక అద్దంకి నాంచారమ్మ అమ్మవారి కళ్యాణ మండపంలో ఆదివారం ఏపీయూటీఎఫ్ ప్రాంతీయ మండలాల విద్యా సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యా సదస్సుల వలన ఉపాధ్యాయులు చైతన్య వంతులవుతారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు ఐక్యంగా ఉండాలని, ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పర్చూరు ప్రాంతం ముందంజంలో ఉన్నదని అభినందించారు. సదస్సులో తూర్పు రాయలసీమ పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్ధి పి.బాబురెడ్డి, యూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, ఐద్యా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి, పర్చూరు ఉప విద్యాశాఖాధికారి అత్తోటి కిరణ్‌కుమార్, మండల అధ్యక్షులు ఎ.శ్రీనివాసరావు, బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు, మండల గౌరవ అధ్యక్షులు కేడీవీ ప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి కేవీ సుబ్బయ్య, ఎఫ్‌డబ్ల్యుఎస్ డైరెక్టర్ కె.కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

విశాలాంధ్ర-మద్దిపాడు : జాతిపిత మహాత్మాగాంధీ కల గ్రామస్వరాజ్యాన్ని వైఎస్సార్సీపీ ప్రభుత్వం గ్రామ స్వరాజ్యం ఏర్పాటులో భాగంగా గ్రామ సచివాలయాలను ఏర్పాటుచేసి పరిపాలనా సౌలభ్యాన్ని సామాన్యులకు అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేయడం జరిగిందని ఎమ్మెల్యే పిజెఆర్ సుధాకర్ బాబు పేర్కొన్నారు. ఆదివారం నాడు స్థానిక మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ కాలనీల నందు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ఇంటింటిని సందర్శించి వైయస్సార్సీపి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలు సక్రమంగా గ్రామస్తులకు అందుతున్నాయా లేదా అని వివరాలు అడు గుతూ సంక్షేమ పథకాల గురించి తెలియజేయడమైనది. రాబోయే ఎన్నికల్లో వైఎస్ఆర్సిపి ఫ్యాన్ గుర్తుపై తమ అమూల్యమైనటువంటి ఓటును వేసి మరల వైయస్సార్సీపి ప్రభుత్వమే ఆంధ్రప్రదేశ్లో ఏర్పడినందుకు తమ ఓటు వేయాలని గ్రామస్తులు కోరడమైనది. ఈ కార్యక్రమంలో మద్ది పాడు వైయస్సార్సీపి అధ్యక్షులు మండల అప్పారావు, ఎంపీపీ వాకా అరుణ, కోటిరెడ్డి, జెడ్పీటీసీ తేళ్ల భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీలు పైడిపాటి వెంకటరావు, మెరబోయిన విజయలక్ష్మి, జిల్లా సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు బెజవాడ శ్రీరామ్ మూర్తి (రాము), స్థానిక సర్పంచ్ మద్దిరాల వెంకటేశ్వర్లు, వైఎస్ఆర్సిపి నాయకులు సంజీవరావు, గడ్డినేను అయ్యన్న ఏలూరి లక్ష్మీనారాయణ, ఘడియపుడి ఎంపీటీసీ పైనం ప్రభాకర్, ఆయా గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు ప్రభుత్వ అధికారులు వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు అభి మానులు తదితరులు పాల్గొన్నారు.

మహేంద్ర కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని చింతలపాలెం గ్రామంలో వైయస్సార్ పార్టీ నాయకుడు పాపసాని చంద్రమౌళి కుమారుడు మహేంద్ర శనివారం హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం జరిగినది. ఈ విషయం తెలుసుకున్న శాసనసభ్యులు బుర్రా మధు సూదన్ యాదవ్ చంద్రమౌళి ఇంటికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. మహేంద్ర మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే బుర్ర మాట్లాడుతూ చిన్న వయసులో మంచి నైపుణ్యం కలిగిన సాఫ్ట్వేర్ ఉద్యోగం పొందిన మహేంద్ర రోడ్డు ప్రమాదంలో చనిపోవడం చాలా బాధాకరం అన్నారు. చంద్రమౌళి కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఆ దేవుడు కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని మహేంద్ర ఆత్మకు శాంతి కలగాలని కోరారు. శాసన సభ్యులతో పాటు చైర్మన్ అబ్దుల్ గఫూర్, సానికొమ్ము రంగనాయకులురెడ్డి, జెడ్పిటిసి కస్తూరిరెడ్డి, ఎంపీపీ ప్రకాశం, రామనబోయిన శ్రీనివాసులు, సంగు సుబ్బారెడ్డి, నివాళులు అర్పించారు.

సీపీఐ పోరుబాట వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-త్రిపురాంతకం : సీపీఐ పోరుబాట గోడ పత్రాలను సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం సీపీఐ మండల కార్యదర్శి బాణాల రామయ్య ఆధ్వర్యంలో సీపీఐ కార్యాలయం వద్ద ఆదివారం జరిగింది. ముందుగా గోడ పత్రాలను ఆవిష్కరించిన నాయకులు అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ పోరుబాట కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు.జగనన్న కాలనీలో గృహాల మంజూరు అయిన లబ్దిదారులకు 5లక్షల ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రస్తుతం ఇచ్చే 1 లక్ష 80 వేల రూపాయలు కేవలం బేస్ మెంట్‌కు మాత్రమే సరిపోతుందని గుర్తు చేశారు. జగనన్న గృహ లబ్దిదారుల కొరకే ఈ పోరుబాట కార్యక్రమం భారతీయ కమ్యునిస్ట్ పార్టీ చేపట్టిందని అన్నారు. పోరుబాట జగనన్న గృహాలు నిర్మించుకోవడంలో లబ్దిదారులు తాము అప్పుల పాలు అవుతున్నట్టు వివరిస్తున్నారు అని ఆయన అన్నారు. ఈ నెల 30న జరుగు మండల,నియోజక వర్గ, డివిజన్ స్థాయిలో రౌండ్ టేబుల్ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. వచ్చే నెల 6న జరుగు కలెక్టరేట్ ముట్టడిని లబ్దిదారులు జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి కాసీం, సీనియర్ నాయకులు పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పిచ్చిరెడ్డి ముఠాని అరెస్ట్ చేయాలి

- దళిత నేత నీలం నాగేంద్ర

మాట్లాడుతున్న నీలం నాగేంద్రరావు

విశాలాంధ్ర-ఒంగోలు : దళిత విద్యార్థిపై దాడి చేసిన దాకా పిచ్చిరెడ్డి ముఠాని అరెస్టు చేయాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. నీలం నాగేంద్ర ఆదివారం ఒంగోలులోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కొండపి మండలం కే ఉప్పలపాడు గ్రామంలోని రెడ్ల బజారులో డిసెంబర్ 7 రాత్రి, తన అనుమతి లేకుండా జరిగిన నవీన్ కృష్ణారెడ్డి అనే యువకుడి బర్తడే పార్టీకి వచ్చిన దళితుల్ని దాకా పిచ్చిరెడ్డి దగ్గరుండిచచ్చేలా కొట్టించారన్నారు. పుట్టినరోజు వేడుకలకు వెళ్లిన,చీమకుర్తి మండలం ఆర్. ఎల్. పురం గ్రామానికి చెందిన దళిత విద్యార్థి దుడ్డు జీవన్ తల పగలగొట్టారన్నారు. ఈ దాడిలో జీవన్ పుర్రె కు రంధ్రం పడిందన్నారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన జీవన్ ఈరోజుకి కోలుకోలేదన్నారు. ఘటన జరిగి 45 రోజులు అయినా, రెడ్ల ముఠాను అరెస్టు చేయకపోవడంతో, దళిత విద్యార్థి దుడ్డు జీవన్ బంధువులు నాగేంద్రతో మాట్లాడారు. నాగేంద్ర, జీవన్ బంధువుల నుండి వివరాలను తెలుసుకున్నారు. దాడి జరిగిన రోజు, తీవ్రంగా గాయపడిన జీవన్ ను హాస్పిటల్‌కు తీసుకువెళ్లేందుకు, స్థానికులు ప్రయత్నించగా, దళిత విద్యార్థికి ప్రాథమిక వైద్యం కూడా అందకుండా, పిచ్చి రెడ్డి వర్గీయులు మోటార్ సైకిల్లను దౌర్జన్యంగా లాక్కుని పిచ్చి రెడ్డి ఇంట్లో పెట్టారన్నారు. పిచ్చి రెడ్డి ముఠా చేసిన అరాచక దాడిపై పోలీస్ కంప్లైంట్ ఇవ్వకుండా బాధితులని భయపెట్టారన్నారు. దళిత విద్యార్థి పై దాడి, దాడి అనంతరం వైద్యం అందకుండా చేయడం రెడ్ల ముఠా భూస్వామ్య, నిరంకుశ పోకడలకు నిదర్శనం అన్నారు. ఈ కేసు విచారణ బాధ్యతలను చేపట్టిన ఎస్సీ ఎస్టీ డిఎస్పి రామకృష్ణ, సింగరాయకొండ మండలం వెంకటేశ్వర కాలనీ మాల కులస్తులపై దాడి చేసిన అగ్రకుల గంజాయి ముఠాకు ఆశ్రయం కల్పించి, మాలల్ని కులం పేరుతో దూషించిన రామి ఒడ్డిని కేసు నుంచి తప్పించాడన్నారు. ఎస్సీ కమిషన్ చైర్మన్ ఆదేశాలను కూడా లెక్కచేయకుండా, నాడు రామిరెడ్డిని డిఎస్పి రామకృష్ణ ఎస్సీ ఎస్టీ కేసు నుండి తప్పించాడన్నారు. ఎస్సీ ఎస్టీ కేసు నుండి దాకా పిచ్చిరెడ్డిని తప్పించేందుకు డీల్ కుదిరినట్లు ఉందన్నారు. అందుకే దాడి జరిగి 45 రోజులు, డీఎస్పీ విచారణ జరిగి 30 రోజులు గడుస్తున్నా, పిచ్చిరెడ్డి ముఠాలో ఏ ఒక్కరిని అరెస్టు చేయలేదన్నారు.పిచ్చిరెడ్డి ముఠా దర్జాగా పోలీసులు ముందే తిరుగుతూ బాధితులని భయభ్రాంతులకు గురి చేస్తుందన్నారు. మొదట పోలీసులు కేసును ఐపిసి 323, 324 సెక్షన్ల మేరకు నమోదు చేసి, డిసెంబర్ 24న ఎస్సీ ఎస్టీ ఆక్ట్ సెక్షన్లు వేశారన్నారు. జనవరి 7న మెడికల్ రిపోర్టు వచ్చినప్పటికీ, హత్యాయత్నం సెక్షన్లు వేయలేదన్నారు. డిఎస్పి రామకృష్ణ దళిత విద్యార్థి పై జరిగిన ఎస్సీ ఎస్టీ హత్యాయత్నం కేసులో, అగ్రకుల నిందితులను అరెస్టు చేయకపోగా, ఆఖరికి ఐపిసి 326 ఐపిసి 307 సెక్షన్లు కూడా ఆల్టర్ చేయలే దన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితులుగా దాకా పిచ్చిరెడ్డితో పాటు, కిషోర్ రెడ్డి, అశోక్ రెడ్డి లు ఉండగా, దాకా పిచ్చిరెడ్డి పేరు తొలగించేలా విచారణ జరపటం, ఇతర నిందితుల్ని సైతం అరెస్టు చేయకపోవడంపై నాగేంద్ర మండిపడ్డారు. సింగరాయకొండ వెంకటేశ్వర కాలనీ మాలలపై దాడి, ఉప్పలపాడులో దళిత విద్యార్థి పై జరిగిన దాడి ఎస్సీ రిజర్వుడు కొండేపి నియోజకవర్గంలో ఎస్సీ ఎస్టీల రక్షణను వేలెత్తి చూపిందన్నారు. దళిత విద్యార్థి దుడ్డు జీవన్ పై హత్యాయత్నానికి పాల్పడిన దాకా పిచ్చిరెడ్డి ముఠాని క్రైమ్ నెంబర్ 125 ఎస్సీ ఎస్టీ కేసులో అరెస్టు చేయకుంటే, రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామన్నారు.

గిడుగు వెంకట రామమూర్తికి ఘన నివాళి

విశాలాంధ్ర-వేటపాలెం : వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి వర్ధంతి సందర్భంగా నియోజకవర్గ జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నియోజ కవర్గ యువ నాయకుడు వరుణ్ మాట్లాడుతూ గ్రాంధిక భాషలో ఉన్నటువంటి క్లిష్టమైన గ్రంథాలను, శాసనాలను సామాన్య మానవులకి అందుబాటులో ఉండే విధంగా వ్యవహారిక భాషలో అనువాదం చేసిన గిడుగు రామ్మూర్తి ఆనాటి సామాన్య సమాజానికి ఎంతో మేలు చేశారు అని వారన్నారు. ఈ కార్యక్రమంలో వరుణ్, చరణ్, పవన్ కుమార్, బూదిద వరం, పింజల సంతోష్, దొగుపర్తి లలిత్ కుమార్, పసుపులేటి సాయి, కిరణ్ తేజ మరియు పర్చూరు నియోజకవర్గ జనసైనికుడు తోట అశోక్ చక్రవర్తి పాల్గొన్నారు.

24న జనసేన కార్యకర్తల సమావేశం

విశాలాంధ్ర-గిద్దలూరు : జనసేన పార్టీ గిద్దలూరు నియోజకవర్గం కార్యకర్తల సమావేశం ఆర్టీసీ డిపో ఎదురుగా ఉన్న విట్టా సుబ్రహ్మణ్యం కళ్యాణ మండపంలో ఈ నెల 24వ తేదీ ఉదయం 11 గంటలకు జరుగుతుందని నియోజకవర్గ ఇన్‌చార్జి బెల్లంకొండ సాయిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గిద్దలూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇంఛార్జి బెల్లంకొండ సాయిబాబు నాయకత్వంలో ఆరు మండలాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ మరియు జిల్లా కమిటీ నాయకులు పాల్గొంటారని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఫోన్ కొట్టు క్వాటర్ సీసా పట్టు

- మండలంలో యథేచ్ఛగా మద్యం డోర్ డెలివరీ
- బెల్ట్ షాపుల్లో క్వాటర్ సీసాపై రూ.50
- డోర్ డెలివరీకి రూ.100 అదనం
- జీవితాలు బుగ్గిపాలవుతున్నా పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర-పీసీపల్లి : అరే బావా అలా కూర్చొని ప్రశాంతంగా సిట్టింగ్ వేద్దామా.... సిట్టింగ్ వేద్దాంలే బామ్మర్ది కానీ వైన్ షాప్ కి వెళ్లి మద్యం తెచ్చుకొనే ఓపిక నా దగ్గర లేదురా... అరే బావా వైన్ షాప్‌కి వెళ్లాల్సిన కర్మ మనకేం పట్టింది క్వాటర్ సీసాకు అదనంగా వంద రూపాయలు చెల్లిస్తే మన వద్దకే మద్యం వచ్చి వాలుతుంది నేను ఫోన్ చేస్తాను ఆగు అంటూ ఫోన్ చేయగానే 10 నిమిషాల్లో మద్యం వారి వద్దకు చేరుతుంది. అరే బామర్ది ఇదేంటి మద్యం షాపుకు వెళ్లవలసిన పనిలేకుండానే మన వద్దకే మద్యం వచ్చింది... అవును రా బామర్ది మనం మద్యం షాప్‌కి వెళ్లవలసిన అవసరం లేదు. ఈ మధ్య చాలామంది మద్యం డోర్ డెలివరీ చేస్తూ క్వాటర్ సీసాపై అదనంగా వంద రూపాయలు వసూలు చేస్తూ అక్రమ వ్యాపారం చేస్తున్నారు. ఇది నిత్యం జరుగుతూ ఉంది. నేను కొంతకాలం నుంచి గమనిస్తూ ఉన్నాను... పీసి పల్లి మండలంలో కొన్ని గ్రామాల్లో నిత్యం జరుగుతున్న తంతు ఇది. సులభమైన తరహాలో డబ్బు ఎలా సంపాదించాలో ఆలోచించిన కొందరు యువకులు ఈ విధంగా మద్యాన్ని డోర్ డెలివరీ చేస్తూ అక్రమంగా దోచుకుంటున్నారు. దీంతో జీవితాలు బుగ్గి పాలు అవుతున్నాయి. వివరాలలోనికి వెళితే పీసీపల్లి మండలంలోని పలు గ్రామాలలో మద్యం డోర్ డెలివరీ యథేచ్ఛగా సాగుతుంది. ఎనిమిదవ తరగతి చదువుతున్న కుర్రాళ్ళ నుంచి డిగ్రీ చదివే యువకుల వరకు మద్యం డోర్ డెలివరీ వ్యాపారాన్ని అక్రమంగా సాగిస్తున్నారు. ఇది ఏం పని అని అడిగేవాళ్ళు లేకపోవడంతో వీళ్ళ మద్యం అక్రమ వ్యాపారం మూడు పూవులు ఆరు కాయలుగా అభివృద్ధి చెందుతుంది. కాంట్రాక్ట్ పద్ధతిలో వైన్ షాపులు నడుపుతున్నప్పుడు ఎక్సైజ్ పోలీస్ శాఖల అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ ఎమ్మార్పీ రేట్లు కన్నా అధికంగా మద్యం విక్రయిస్తున్న షాపులపై చలాన్లతో విరుచుకు పడేవాళ్లు. కానీ పరిస్థితులు మారిపోయాయి వైఎస్ఆర్సిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వమే మద్యం దుకాణాలను ఎక్సైజ్ శాఖ ఆధీనంలో సూపర్వైజర్లు సేల్స్ మేన్ల ద్వారా మద్యం షాపులను నడిపిస్తుంది. దీంతో ప్రభుత్వం మద్యం షాపులే కదా అని ఎక్సైజ్ పోలీస్ శాఖల అధికారులు కూడా ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు. ఇదే అదునుగా భావించి సేల్స్ మెన్లు సూపర్వైజర్లు మద్యం అక్రమాలకు తెరలేపుతున్నారు. క్వార్టర్ సీసాపై అదనంగా రూ.10 రూపాయల నుండి 20 రూపాయల వరకు తీసుకుని బెల్ట్ షాప్ నిర్వాహకులకు మద్యం డోర్ డెలివరీ నిర్వాహకులకు అడిగిన కాడికి మద్యం విక్రయిస్తుండడంతో బెల్ట్ షాపులు గ్రామాలలో పుట్టగొడుగుల్లా వెలు స్తున్నాయి. మండలంలో రెండు ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉన్నాయి. అపరిచిత వ్యక్తుల సమాచారం మేరకు సేల్స్ మెన్లు బెల్ట్ షాప్ నిర్వాహకులతో బేరం కుదుర్చుకొని యథేచ్ఛగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం. దీంతో గ్రామాల్లో బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి.

పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నప్పటికీ

ఇది ఇలా ఉండగా మండలంలో పోలీసులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నప్పటికీ ఒక షాపులో తనిఖీలు చేస్తున్నప్పుడు మిగతా షాపుల యజమానులు వెంటనే తేరుకొని తమ వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం సీసాలను తమకు సంబంధించిన వ్యక్తులతో బంధువులతో ఇతర ప్రాంతానికి తరలిస్తున్నారు. దీంతో పోలీసులు చేసే తనిఖీలు వృధా అవుతున్నాయి. విచిత్ర వేషధారణలో పోలీసులు తనిఖీలు చేసినప్పటికీ బెల్ట్ షాప్ నిర్వాహకులు తనిఖీలు చేసేది పోలీసు లేనని పసిగట్టి అక్రమ మద్యం పోలీసులకు చిక్కకుండా జాగ్రత్తలు పడుతున్నారు. దీంతో పోలీస్ శాఖ అధికారుల శ్రమ వృధా అవుతుంది.

కన్నెత్తి చూడని ఎక్సైజ్ శాఖ అధికారులు

మండలంలో ఎక్సైజ్ శాఖ అధికారుల జాడ కనిపించడం లేదు. అత్యధికంగా పీసీపల్లి మండలంలో ఒక్కో గ్రామంలో అరడజనుకు పైగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నప్పటికీ మామూళ్లకు అలవాటు పడి బెల్ట్ షాప్ నిర్వాహకులపై కేసులు నమోదు చేయడం లేదు. పత్రికల్లో పలు కథనాలు వచ్చినప్పుడు హడావుడిగా తనిఖీలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారు. కొన్ని సందర్భాల్లో పట్టుబడిన బెల్ట్ షాప్ నిర్వాహకులను మార్గమధ్యంలోనే బేరాలు మాట్లాడుకుని వదిలేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. దీంతో సంబంధిత శాఖ అధికారులు అండదండలు పుష్కలంగా ఉండడంతో బెల్ట్ షాప్ మద్యం డోర్ డెలివరీ నిర్వాహకులు రెచ్చి పోతున్నారు. సంబంధిత శాఖ అధికారుల అలసత్వాన్ని అదునుగా తీసుకొని యదేఛగా బెల్ట్ షాపులు నిర్వహిస్తూ అందిన కాడికి దండుకుంటున్నారు. ఇంత జరుగుతున్న సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో వారి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుంది. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు సంబంధించి బెల్టు షాపులు డోర్ డెలివరీ వ్యక్తుల ఆట కట్టించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

శభాష్ కౌన్సిలర్ ప్రశాంతి శ్రీనివాసులు



విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి పులి వెంకటరెడ్డి పార్క్ వద్ద ఆదివారం ఆవు అస్వస్థకు గురై నిర్జీవంగా పడి ఉండటంతో స్థానికులు ఒకటో వార్డు కౌన్సిలర్ రామనబోయిన ప్రశాంతి శ్రీనివాసులకు సమాచారం తెలిపారు. హుటా హుటిన కౌన్సిలర్ రామనబోయిన ప్రశాంతి శ్రీనివాసులు పశు వైద్యాధికారి బాలకృష్ణ చొరవతో పశువైద్య సహాయకుడు వాసు సహకారంతో ప్రధమ చికిత్స చేసి ఆవుకు సఫర్యలు చేయటంతో ఆవు కోరుకుంది. అనంతరం కౌన్సిలర్ ప్రశాంతి శ్రీనివాసులు మెరుగైన పశు వైద్యం కొరకు టోల్ ఫ్రీ నెంబర్ 1962కు కాల్ చేసి సమాచారం అందించడంతో వెంటనే పశు సంచార వైద్య వాహనంలో పశువైద్య బృందం ఆవుకు మెరుగైన వైద్య అందించి అవుకు ప్రాణాపాయం నుండి రక్షించిన్నారు. కౌన్సిలర్ ప్రశాంతి శ్రీనివాసులు ఆవు యజమానికి అవును అప్పగించడం జరిగింది. ఈ సందర్భాగా యజమాని కృతజ్ఞతలు తెలిపారు. వైద్యాధికారి బాలకృష్ణ మాట్లాడుతూ రోడ్లపై ప్లాస్టిక్ వ్యర్థాలను తినడం వలన ఆహారము విషతుల్యమై ఆవులు నోటి వెంట నురుజు రావడం, గ్యాస్ ఎక్కువై ఊపిరాడక చనిపోవడం జరుగు తుందని ఇలాంటి పరిస్థితిలో వెంటనే వైద్యం అందించడం వలన మూగ జీవులైన ఆవులను రక్షించుకోవచ్చని తెలిపారు. ఎట్టి పరిస్థితిలో ప్లాస్టిక్ కవర్లో ఆహార పదార్థాలతో రోడ్లపై వెయ్య రాదన్నారు. అలాగే మూగజీవులను రోడ్లపైకి రాకుండా ఆయా మూగజీవుల యజమా నులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కౌన్సిలర్ తో పాటు స్థానిక పోలీసులు,పారా లీగల్ వాలంటీర్,గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్ బాబు పలువురు ప్రశంసించారు.

గుంటి గంగ దేవాలయ ఆదాయం రూ.16,632

విశాలాంధ్ర-తాళ్లూరు : ప్రకాశం జిల్లాలో ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన తాళ్లూరు మండలం తూర్పు గంగవరం పంచాయతీ పరిధిలోని సోమవరప్పాడు రెవెన్యూ పరిధిలో ఉన్న గుంటి గంగక్షేత్రంలో ఆదివారం భక్తుల కోలాహలం నెలకొంది. ఉదయము నుండే ఆలయ పూజారి, దేవాదాయ శాఖ వారు గుంటి గంగ మూల విరాట్‌ను పట్టు వస్త్రాలతో, పూలమాలలతో, బంగారు, వెండి ఆభరణాలతో అందంగా అలంకరించి పూజా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాల నుండే కాక జిల్లా నలుమూలల నుండి భక్తులు పాల్గొని నైవేద్యాలతో అమ్మవారి మొక్కులు తీర్చుకుంటూ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతీయ ఉపాధి హామీ పనుల శాఖ ఈసీ ప్రసాదు తమ కుటుంబ సమేతంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ ట్రస్ట్ కమిటీ చైర్మన్ కటకం శెట్టి శ్రీనివాసరావు వారిని సాదరంగా దేవాలయంలోనికి ఆహ్వానించి, భక్తులకు అందుతున్న సౌకర్యాలు పర్యవేక్షించారు.